ఉపాసిగా ఆయన చాలా కాలం కృషిచేశారు.

అయితే ఆచార్యులుగారికి సినిమా ప్రపంచముతో గల సంబంధం ఇంకా పాతదే. వేల్ పిక్చర్స్ వారి "సీతా కల్యాణం" నాటినుంచీ ఆయనకు సినిమా ప్రపంచంతో అంతో ఇంతో సాన్నిహిత్యం ఉంటూవస్తున్నది. అయినా ఈ రంగంలో కొంత కృషిచేయాలని ఆయనకుంటూ వచ్చిన అభిలాష ఆయనకు అరవై నిండినాక, కిందటేడే, ఫలితానికివచ్చి ఆయన జెమినీ స్టూడియోస్‌లో తెలుగుచిత్రాలకు డైరెక్టరుగా ప్రవేశించారు. ఆయన పనిచేసిన మొదటిచిత్రం "ముగ్గురు కొడుకులు" ఇంకా పూర్తికాక పూర్వమే ఆయనకు ఆయుర్దాయం తీరిపోవడం శోచనీయం.

శేషాచారిగారు విద్యాధికుడు, సంస్కారి దాదాపు అన్ని కళారంగాలలోనూ మంచి తెలిసినవాడు. తెనాలిలో న్యాయవాదవృత్తిలో గొప్ప విజయం సాధించినవాడు, ఎక్కువగా చెప్పుకోదగిన ఎమెచూర్ నటుడు. షేక్స్పియర్ నాటకాలలో నటించినవాడు. కృష్ణశాస్త్రి విశ్వనాథగార్లవంటి కవులకూ, స్థానం మాధవపెద్దిలాంటి నటులకూ సన్నిహితుడు, భగవంతుడు అనుకూలించినట్లయితే తెలుగు సినిమాకు చెప్పుకోదగిన సేవచేయగలిగే వాడనటానికి సందేహం లేదు. ఈయన ఆత్మకు శాంతి.

---

కథానిక

# జ్యోతిష ప్రభావం

" పరంధామయ్య "

బ్రహ్మానందానికి మానవాతీతమైన శక్తుల్లో అనంతమైన విశ్వాసం. ఏదో దుష్టగ్రహం తన పురోభివృద్ధికి అడ్డుపడుతూ వుండన్ని లేక పోతే రాజభోగం అనుభవిస్తూ వుండగలిగే వాడినని అతని గాఢమైన నమ్మకం. చేయి చూస్తానన్న ప్రతిగోసాయికి చేయి అందించే వాడు. కాషాయి గడ్డంతోవున్న ప్రతిసాధువుని తన గృహాన్ని పావనంచేసి వెళ్ళవలసిందిగా వేడుకొనేవాడు.

ఒకనాటి మధ్యాహ్నం బ్రహ్మానందం ఒక సాధుపుంగవుని తన యింటికి తీసుకవచ్చాడు. పడక కుర్చీలో అతన్ని కూర్చుండబెట్టి, వంట యింట్లోకి పరుగెత్తాడు.

"ఏమేయ్! వంట త్వరగా కానీ. ఈనాటికి మన జన్మ తరించింది. ఒక మహానుభావుడు నా ప్రార్థనను మన్నించి మనింటికే వచ్చాడు."

"ఎవరు గడ్డాం పెంచుకున్నా మీకు మహాత్ములే."

"ఆయనన్నట్టనబాకే కొంప–మునుగుతుంది."

"మీ వెర్రి కాకపోతే, అంతమహాత్ము వుంటే వాడు మన కొంపకు వస్తాడటండీ?"

"వకలాగాన వచ్చాడూ? అతని కాళ్ళా వేళ్ళా పడ్డాను. వస్తే సేగాని కొదన్నాను, నా భక్తికి మెచ్చి పరవశమైపోయి అలాగే అన్నాడు."

"ఇంతకు ముందు యెందరు రాలేదు? అందరినీ యిలాగనే పొగిడేవారు. వీరికి అమర్చిపెట్టలేక నా తల ప్రాణం తోకకు వస్తుంది."

"అరెరె! మళ్ళీ అదే ధోరణి. చెంపలన్నా వేసుకోవే! చూశావా అతని మహాత్తు—నన్ను చూడగానే నీకొక మగ పిల్లవాడు కదూ! అన్నాడు. అవునన్నాను. అంతకు ముందు యిద్దరు బిడ్డలు పోయినారు కదూ అన్నాడు. అవునన్నాను ఆశ్చర్యంతో-యీ బిడ్డకు చిన్నతనంలో ఒక సాధువు కాయకట్టాలే వుండా అని అన్నాడు. అంతే—అతని కాళ్లు రెండూ పట్టుకొని స్వామీ యీ దీనుడి గృహం మీరు పావనం చేయాలని వేడాను. ఇన్నాళ్ళకి మన జన్మ తరించిందే వెర్రి మొహమా! ఎటువంటి వర్చస్సు! మనిషినటు చూడంగానే పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పేస్తాడు!"

"అన్నీ అంత కరెక్టుగా చెప్పేశాడుటండీ"

"చెపితే కేగదూ ఇంత ప్రాధేయపడితీసుకు రావటం. కానీ, వంట బలే మజాగా వుండాలి."

"కూరేమీ లేదే - కంది పులుసు మాత్రం చేశాను. కొంపలో ఒక్క దమ్మిడీ లేదు."

"ఈ పాడుకొంపలో ఎప్పుడూ దరిద్రమే సమయానికి."

"ఎక్కడనుంచి వస్తుంది. డబ్బు కళ్ళ చూడాలంటే గింజలమ్మితే నేగా — ఆ గింజలు కూడా తిండికి చాలకుండా పండిస్తుంటిరి. పదెకరాలు సేద్యం చెయ్యటమేమో — పది పుందుములు కొంపకు రాకపోయినే — చేసేది అర్ధాన్నంగా చేసుకుని నన్ను బట్టుకొని వూగులాడితే —"

"ఈ వాలిటికి కొంచెం వోపికపట్టు — నా పరువంతా నీపై వుంది. తర్వాత నీ యిష్టం."

బ్రహ్మానందం ఒక్క వూపులో సాధువువద్ద కొచ్చి చేతులుకట్టుకొని వినయంగా నిలబడ్డాడు. సాధువు నిమీలితనేత్రాలతో బ్రహ్మానందాన్ని చూచి కూర్చోమని సంజ్ఞ చేశాడు. "ఉక్కబోస్తుంది. విసనకర్ర పట్టుకొస్తాను-" అంటూ బ్రహ్మానందం లేవబోయాడు.

"ఫరవాలేదు-నాకేం యిబ్బందిగా లేదు. కూర్చో" అన్నారు సాధు చిరునవ్వుతో — "మీ అబ్బాయేడి వాడిని చూడాలని వుంది"

"ఆవైటో ఆడుకోటానికి పోయివుంటాడు. పిలిపిస్తాను" అంటూ బ్రహ్మానందం లేచి భార్య వద్దకు పోయి —

"ఆయన మనఅబ్బాయిని చూడాలనితొందర పడుతున్నాడే, ఎటు వెళ్లాడో పిలిపించాలి."

"దొడ్లో జామ చెట్టు కింద ఆడుకుంటున్నాడు పిలవండి." బ్రహ్మానందం దొడ్లోకి పరుగెత్తి — "ఒరే గోపాల్ యిటు రా అక్కడ స్వాములవారు వచ్చివున్నారు. సాష్టాంగపడు" సాష్టాంగపడటం గోపాలుకు కొత్తేమీ కాదు. వాడు కట్టిన మట్టిల్లు యెవరు పడదోసి పోతారో యని కొంచెం సందేహించాడు. "రారా మళ్ళా యిప్పుడే వస్తువు." బ్రహ్మానందం వాడిని లాక్కుపోయాడు. గోపాలానికి నాలుగేళ్లుంటాయి. నల్లగా బక్కగావుంటాడు. గుడ్డలు మాసివున్నాయి. సాధువును చూడగానే గోపాలు సాష్టాంగ పడ్డాడు. సాధువు చిరునవ్వుతో వాణ్ణి లేవనెత్తి —

"ఏది బాబూ, చెయ్యిచూపు" అన్నాడు. గోపాలు చెయ్యి చూపించి తండ్రివైపు చూశాడు.

"అరే ఏమిటీ" సాధు ఆశ్చర్యంగా బ్రహ్మానందంవైపు చూశాడు.

"ఎంత విచిత్రం యీ పూరిపాకలోనా వీడువుంట" బ్రహ్మానందం మరింత వినయంగా సాధువు ముందు కూలబడి ఆశ్చర్యంతో అతనివైపు చూడసాగాడు.

"నమ్మటానికి వీలులేదు" సాధువు గంభీరంగా అన్నాడు.

"ఏమిటిస్వామీ? మా పిల్లవాడు కాదంటారా?"

"అయితే యీ పూరియిల్లు మీదికాదు."

"మాదేస్వామీ! యీ అబ్బాయి కూడా మావాడే."

"ఏమిటీ వింత, మిద్దె యింట్లో తిరగాల్సిన బిడ్డ."

"రెండేళ్ళ కిందటనే పునాదులు వేశాం కాని, సరిగా పంటలు పండక—" నసిగాడు బ్రహ్మానందం.

ఇంటివైపూ పునాదులవైపూ చూసి సాధువు నెమ్మదిగా "ఇది సరిగాలేదు. దీంట్లోనే వుంది నిన్ను అణగదొక్కే మాయభూతం" అన్నాడు.

"యీ చోటే బాగలేదా స్వామీ?"

"చోటుకేం లోటులేదు. ఇంటి ప్లానులోనే వుంది చెడ్డంతా."

"స్వామీ యిప్పటికైనా మీరు చెప్పారు కాబట్టి సరిపోయింది. నాశనమైపొయ్యేవాడిని నన్ను కరుణించి—"

"ఇంటి ప్లాను చెప్తాను. శంకుస్థాపన చేస్తాను. నీకేం పర్వాలేదు. అయితే రెండు సవర్ల బంగారు కావాలి. నాకేమీ ఒక్క దమ్మిడీ వద్దు. ఆ మాయరాక్షసిని వదలించాలంటే ఆ సువర్ణం భూస్థాపితం చెయ్యాలి. మొన్న మాలేడుపల్లిలో యీ మాదిరే ఒకరింట్లో జరిగింది. అక్కడేవిధంగా జరిగిందో ఆ కార్యకలాపమంతా యిక్కడ కూడా జరిగితీరాలి. అప్పుడే నీవు బాగుపడేది. యిదేం టక్కరి కాదు. శాస్త్రం."

"స్వామీ మీ మాట కాదనే మూర్ఖుడు

కూడా వుంటాడా?"

"మంచిది. రేపు త్రయోదశినాడు ఆ రోజుకు నాలుగు దినాలుంది. అద్భుతమైన లగ్నం. ఈ లోపల ప్లాను వేసి—ఆ రోజు శంకుస్థాపన జేస్తాను."

బ్రహ్మానందం వినయంతో ముడుచుకొని పోయి సాధువు కాళ్లు పట్టుకొన్నాడు.

* * *

రెండుసంవత్సరాలు గిర్రున తిరిగి పోయినై. పిల్లవాడు బడిలో చదువుకుంటున్నాడు. ఇంత కాలానికి బ్రహ్మానందానికి ఒక ఆడపిల్ల పుట్టింది. భూమి తనఖా పెట్టి అయిదువేలు అప్పుచేసి బ్రహ్మానందం ముచ్చటైన ఇల్లు కట్టాడు. ఇరుగు పొరుగువారు పిల్లవాడు కలిగిన ముహూర్తబలం అని శ్లాఘిస్తున్నారు. కాని బ్రహ్మానందం మాత్రం ఇల్లు కట్టాననే వుత్సాహం ఏమాత్రం చూపడంలేదు. పూర్తికాని లేక కాంపౌండు గోడలు పడిపోయేందుకు సిద్ధంగా వున్నయ్- సిమెంటుకు డబ్బులేదు. అప్పుకుపోతే ఇచ్చింది తీర్చవయ్యా, తర్వాత చూస్తాం అన్నట్లు మాట్లాడుతున్నారు. పైగా ఒకనాడు అతని బావమరది వినాయకం వచ్చి అతనికి లేనిపోని భయం పెట్టి పోయాడు.

"ఇల్లయితే కట్టావు హాయిగా వుంది. అప్పు తీర్చే వుపాయం వెదికావా?" అన్నాడు వినాయకం.

"అప్పెంత సేపోయ్. స్టార్స్ తిరగాలె కాని" బ్రహ్మానందం బీడీ దమ్ము లాగుతూ హుషారుగా అన్నాడు.

"నీ పిచ్చి మరీ ముదిరి పోతోంది బావా. ఫలితం మన కృషిలో వుంటుంది కాని – ఏదో అదృష్టంవల్ల ధనరాసులు అమాంతం వచ్చి పడతయ్యనుకున్నావా?"

"అయితే అదృష్టమనేది లేదంటావా?"

"వుంటే వుండొచ్చు. కాని దానికోసం కాచుకొని కూర్చోడం తెలివితక్కువ. అదొక చాన్సు-అంటే వీధిలో పర్సు దొరకటం-భూమిలో బంగారం దొరకటం వంటిది ఆ చాన్సు."

"నీ పిల్లిమూర్ఖానికేంగాని—నాకుందోయ్ ఆ నమ్మకం."

"సరే. నీ తిక్క కూడా తెలుస్తుందిలే. ఎవడో బికారి కట్నంకోసం ప్లానేసి, అయిదువేలు అప్పు చేయించి కొంప కట్టించాడు. అది తీరిస్తేగా నీ అదృష్టం సంగతి బైటపడేది."

"అయనన్నట్టనబోకు కళ్ళుపోతవి."

"అయనటువంటివాడు కాదురా అబ్బాయి. మనదగ్గిర దమ్మిడి తీసుకోలేదు" అన్నది బ్రహ్మానందం భార్య దొడ్డిలోనుంచి వస్తూ.

"నీదొక పిచ్చి అక్కయ్యా. నాయుడు దగ్గర రెండువందలు తెచ్చి బంగారు కప్పు తెచ్చింది తెలియదూ."

"ఏమండి-నిజమేనా?"

"తెచ్చింది నిజమే. కాని ఆసవర్ణ భూస్థాపితం చేశాం అంతేగాని అతడు తీసుకోలేదు."

"ఎంత అమాయకుడవు బావా! నువ్వేకాదు నీ తాలూకాలో పదిమంది దాకా మోసపోయారు సవర్ణభూస్థాపితం చేసే అంతటి తెలివితక్కువవాడు కాదు సాధువు."

"ఏమిటోరా అబ్బాయి. ఎవరేది చెప్పినా నమ్మేస్తాడు. యిప్పుడా పిల్లల నోటికాడిది రెండెకరాలు అమ్మితేనేగాని అప్పు తీరేట్టు లేదు."

"మీవాడి మాటలకేం చెప్పు వాడెప్పుడూ అంతే లేవే?"

"అయిందేదో అయింది ఇకనుంచైనా బుద్ధి తెచ్చుకొని యీ గోసాయిల్ని కొంపమీదికి లేబాకండి."

"ఇంత అప్పుజేసి యిల్లు కట్టావే ఎలా తీరుస్తావని"

"అంతా మా కర్మలేరా జోతిష్యప్రభావం."

"ఆ జోతిష్యప్రభావమే మిమ్మల్నివిధంగా వుంచింది తొందరగా ఆ రెండెకరాలు తెగనమ్మి అప్పుగట్టి కుదురుగ్గా సేద్యం జేసుకోండి. లేకుంటే అదృష్టంకోసం ఎగురుచూస్తారా ఆ రెండెకరాలే గాదు – మిగతా పొలం ఈ కొంపతో సహా కొట్టుకపోతుంది. ఏటా ఆయినోండలు అప్పు తెస్తూ మీరేం అప్పు తీరుస్తారు!"

"నిజమే నాయనా ఏంజేస్తాం నా కర్మ."

"నీ కర్మకాదు. అతని గ్రహం వదలే వరకూ ఆ బిడ్డల కర్మకూడా—"